70

జ్ఞానోదయం

విశ్వనాథం పార్కులో కూర్చుంటే పదిమందీ చేరడం, ఏదో విషయాన్ని లేవదీసి ఆయనను వాదనలోకి దించడం, ఆయన వాగ్ధాటికి వారంతా అచ్చెరువు ఒందడం, కొందరికి జ్ఞానోదయం కలగడం జరుగుతూ వుంటుంది. అయితే ఈ విధంగా జరగడానికి పార్కే అవసరం లేదు. కాఫీ క్లబ్బులు, కిళ్లీ దుకాణాలు, నిర్మానుష్యమైన సందులో వుండే రోడ్డు పక్క కానాలు మొదలైనవి కూడా వారికి చర్చా వేదికలే. రాజకీయాలు సాంఘిక సమస్యలు మొదలుకుని అమ్మవారి పండుగవరకూ, మనస్తత్వ శాస్త్రం మొదలుకుని పాకశాస్త్రంవరకూ, ఆటం బాంబులు మొదలుకుని అప్పడాలవరకూ ఈ భగవత్ సృష్టిలోని ప్రతి విషయమూ వారి చర్చనీయాంశమే.

ఒకనాడు సాయంత్రం విశ్వనాథం నిద్రలేచి, కొంచం మాసిన పంచె, కొంచెం చిరిగిన చొక్కా, తన తండ్రి వదిలిన ఆస్తిగా పరిగణించకుండా వేసుకుని, భార్య కాఫీ తెచ్చి యిస్తుందేమోనని నిరీక్షించి, ఆశాభంగము కలిగి, పార్కుకు మేము కూడా వస్తామని పట్టుబట్టిన తన యిద్దరు పిల్లలనూ గట్టిగా మందలించి వీధిలోకి బయలుదేరాడు. ఉదయం పది గంటలకు నాలుగు మెతుకులు తిన్నది మొదలు పచ్చి మంచి నీళ్ళైనా పుచ్చుకోక పోవడంవల్ల తనకు ఆకలివేస్తున్నట్లు హఠాత్తుగా గ్రహించినవాడై, తన ఆధ్యాత్మిక చింతనకు భంగం కలిగి, నడిబజారులో నిలబడి దిక్కులు కలయజూశాడు. ఎదురుగుండా కాఫీ

హోటేలు కనబడగా, అప్రయత్నపూర్వకంగా జేబులుతడుము
కుని, నిరాశనుపొంది కాఫీ యిప్పించగల ధర్మదాత ఎవడైనా
వున్నాడా అనే ఆలోచనలో పడ్డాడు. అదృష్టవశాత్తూ ముగ్గురు
స్నేహితులు శ్రీమూర్తులవలె ప్రత్యక్షమైనారు. వారు సుహృల్లు
డైన విశ్వనాథాన్ని పలకరించి, యోగక్షేమములడిగి, ఆయనింకా
కాఫీ సేవించలేదని గ్రహించినవారై ముగ్గురూ మూడణాలు
చందా వేసుకుని ఆయనను తృప్తిపరచారు. దివ్యౌషధంవలె
ఆకలిని చంపే పరబ్రహ్మస్వరూపమైన కాఫీని సేవించిన విశ్వ
నాథానికి ఆరోజుకు కాఫీ సమస్యా పరిష్కారం కావడంతో
తన జీవిత సమస్యాపరిష్కారమైనంత ఆత్మసంతృప్తి కలిగి,
హుషారుగా మిత్రులతో సహా పార్కు చెరువు గట్టున చేరు
కున్నాడు.

పార్కు రేడియోలో పంచవర్ష ప్రణాళికమీద ప్రసంగం
మొదలైంది. తృతీయ పంచవర్ష ప్రణాళికలో ఏ ప్రాజెక్టులు
అమలు జరుగుతాయో, వాటి మూలంగా ఎంతమందికి ఉద్యో
గాలు దొరుకుతాయో వివరిస్తున్నాడు ఉపన్యాసకుడు.

ముగ్గురు మిత్రులలో ఒకడు వ్యాఖ్యానం ఆరంభించాడు
'ఉద్యోగాలు, ఉద్యోగాలు అంటారు, కాని ఎక్కడున్నాయి
ఉద్యోగాలు చెప్పండి!"

"వట్టి కబుర్లు కాని, నిరుద్యోగ సమస్యను మనవాళ్లు ఈ
జన్మలో పరిష్కరించగలరా?" అన్నాడు విశ్వనాథం.

"అలాగ కాదు లెండి, అప్పుడే ప్రాజెక్టులు వస్తున్నాయి
గదా; క్రమేణా, నిరుద్యోగసమస్య కూడా పరిష్కారం
అవుతుంది." మరి.

"ప్రాజెక్టులు, ఫాక్టరీలు నిర్మిస్తే కూలీలకు ఉద్యోగాలు దొరుకుతాయి. కాని బి. ఎ. లు ఎమ్. ఏ. లు చదువుకున్న వారి గతేమిటి? ఒక వేపు జనాభా కూడా పెరుగుతున్నదాయెను" అన్నాడు విశ్వనాథం.

"ప్రతివాడూ బి. ఏ. పాసయి ఆఫీసరు కావాలనుకుంటూంటే ఈ సమస్య ఎప్పటికీ పరిష్కారం కాదు. వివిధవృత్తులు నేర్చుకోవాలిమరి."

"అన్నట్లు విశ్వనాథంగారూ, మీ ఉద్యోగ ప్రయత్నం ఏమయింది?" అని ప్రశ్నించాడు అందులో ఒకడు.

"ఏ ఉద్యోగం?"

"అదే స్కూలు టీచరు పోస్టుకు అర్జీ పెడదామనుకున్నారుకదూ?"

"అదా, ఒట్టి వెధవ ఉద్యోగం, ఫస్టుఫారంవాళ్ళకి పాఠం చెప్పాలిట. ఆ గుంట వెధవలికి ఓ, అంటే నా రాదు. హెడ్‌మాస్టరొక ఫూలు. వాడికింద నేను పనిచేయాలిట. అయినా ఫస్టుఫారంవాళ్ళకి మనం చెప్పేదేముంటుంది చెప్పండీ" అన్నాడు విశ్వనాథం.

"అవును లెండి, మీరు చెప్పే విషయాలు హెడ్మాస్టరుకే బోధపడవు. అయినా ఈ మన వెధవ సొసైటీలో తాహాతుకు తగిన ఉద్యోగం దొరకడం కష్టం."

"అందుకేనండీ తాలూకా కచ్చేరి గుమాస్తాగిరికీ నాకు మరీ పడిందికాదు. మనకు తగిన జాబ్ దొరికితేగానీ చేయ్యడానికి ఇంటరెస్టు ఉండదు, మొన్న మా జిలా కలెక్టరు కనబడి, కొన్ని పెద్ద పోస్టులు రానున్నాయి, మీరు రాకూడదా

అన్నాడు. మీవంటివారంతా ప్రభుత్వానికి తోడ్పడాలిమరి అన్నాడు. సరేలే. ఎలాగా రాజధాని వెళ్తున్నానుగదా, మంత్రులతో చర్చిస్తానులే అనేశాను"

"ఏమిటీ, జిల్లాకలెక్టరుగారు మీకు బాగాపరిచయమా?"

"ఆ, నా క్లాసుమేటే పాపం, ఒక్కొ శుంఠసుమండీ, అదృష్టం బాగుండి మంచి ఉద్యోగమయిందిగానీ అయితే, మంచివాడు లెండి, మనమంటే చాలా గౌరవం."

"అయితే, హైదరాబాదు వెళ్లే ప్లాను వున్నదన్నమాట"

"వెళ్ళాలండి, నలుగురినీ కలుసుకుంటే వాళ్లే చూపిస్తారే ఏదైనా సరియైన ఉద్యోగం."

"అయితే, విశ్వనాథంగారూ మావాడు బి. ఏ. పాసయి ఊరికే ఉన్నాడు; వాడికేదైనా ఆధరవు చూపిద్దురూ, మీ రుణం ఎప్పుడూ తీర్చుకోలేను."

"అలాగే, తప్పకుండా చూద్దాము."

బాగా చీకటి పడ్డది. పార్కులో జనం పలచబడ్డారు. చలి వేయడం మొదలు పెట్టింది. మంచు పడుతున్నట్లుంది. బీడీలు ఆరిపోయాయి విశ్వనాథంగారికి గుండెల్లో చలి మొదలైంది. నలుగురూ లేచి నడక ప్రారంభించారు. బజారులోవున్న గంట స్తంభంవైపు చూసి ఒక మిత్రుడు "ఇంకా ఏడైనా కాలేదండీ. శీతాకాలంపొద్దుమరి. ఇప్పటినుండి యిళ్ళకివెళ్ళి చేసేదేముంది? విశ్వనాథంగారి యింట్లో ఓ పావుగంట కూర్చుని పోదాం" అన్నాడు.

"తప్పకుండా రండి" అన్నాడు విశ్వనాథం.

అంతా విశ్వనాథం ఇంటికి చేరుకునేసరికి వీధి చావడి

చీకటిగా వుంది. పిల్లలు వాకిట్లో ఆడుతున్నారు. లాంతరు వెలిగించాలనుకున్నాడు విశ్వనాథం. కాని ఎవరిదగ్గరా అగ్గిపెట్టె లేదు. విశ్వనాథంగారు భార్యను కేక వేశారు, అగ్గిపెట్టె తెమ్మని ఆమె వంటింట్లోంచి చిరాకుగావచ్చి "అగ్గిపెట్టెఅయిపోయింది. పొరుగింట్లోంచి నిప్పు తెచ్చి పొయ్యి అంటించాను. వెళ్ళి కొనుక్కురండి" అంది.

"అగ్గిపెట్టెకూడా నేనే తేవాలా, బజారునుంచి తెప్పించలేకపోయావ్వా? ఇంతోటి పని నేనే చెయ్యాలా?"

"కాళ్ళు అరిగేటట్లు ఊరికే తిరక్కపోతే పోనీ ఇంతకంటె ఘనకార్యం చెయ్యరాదూ, అగ్గిపుల్లలుకూడాపొరిగింటి వాళ్ళను ముష్టెత్తుకునే కర్మైనా తప్పుతుంది."

"ఛీ నోరుముయ్యి, నోటికొచ్చినట్లు పేలుతున్నావు."

"మీ కర్మం ఎలాగో ఏడవండి" అని ఆవిడ లోపలికి వెళ్ళిపోయింది.

ముగ్గురు మిత్రులు ఈ సీనంతాచూసి, విశ్వనాథంగారి వద్ద సెలవుతీసుకుని, జారుకున్నారు.

విశ్వనాథంగారికి తల కొట్టినంతపనయింది. మిత్రుల ముందు తనకింత అవమానం! తన ప్రతిష్టకెంత దెబ్బ! మళ్ళీ రేపు వాళ్ళకి తన మొహం ఎలా చూపెట్టగలడు. ఆయనకి కోపంతో వళ్ళు మండింది.

అంతట్లో భార్య వచ్చి ప్రమిదలో దీపం తెచ్చి అక్కడ పెట్టింది.

"నిన్ను చంపినా పాపం లేదు. స్నేహితులు ఇంటికొస్తే వాళ్ళముందు నోటికొచ్చినట్టూ ప్రేలుతావేం"

"ఎవరు వాళ్ళు, కారుచీకటిలో ఎవరున్నారో, ఎవరు చచ్చారో నాకేం తెలీదు" అన్నదామె.

"అయినా నీ నోరుకు అడ్డూ ఆపూ లేదుసుమా, వాళ్లే మనుకుంటారు?"

"మళ్ళీ అదే మాటా, ఇంతకీ ఎవరా వెధవలు, పనీ పాటూ ఉన్న వాడెవడు మీతో స్నేహం చేస్తాడు"

"ఛీ నోరుముయ్యి, నోటికొచ్చినట్టు వాగేవంటే చంపేస్తాను"

"ఆ పని చెయ్యండి, హాయిగా పోతాను. ఆ చావేదో రావడం లేదనే ఏడుస్తున్నాను."

"ఛీ, వెధవింట్లో ఒక్క నిముషం మనసుకు శాంతి లేదు. నేను చస్తే ఇక ఈ ఇంటో వుండను, మీరంతా కట కట్టుకుని ఏట్లో పడండి, నే పోతాను" అని విశ్వనాథం వీరావేశమెత్తి, మళ్ళీ కండువా భుజాన వేసుకుని వీధిలోకి వెళ్ళి పోయాడు. ఆవిడ నిర్ఘాంతపోయి చూస్తూ నిలబడింది.

ఆ రాత్రి ఆమె భోజనం చెయ్యలేదు. పిల్లలకు పెట్టి నిద్రపుచ్చింది. ఈ రాత్రప్పుడు, ఆకలితో చలిలో ఎక్కడికి వెళ్ళేరు? భోజనానికి రమ్మని ఎవరు పిలిచి పెడతారు, ఎవరా దరిస్తారు? నేనెంత పాపిష్టిదాన్ని, ఆయన మనసు ఎందుకు నొప్పించాను? పాపం, ఆయన పసిపిల్లాడిలా ప్రతిదానికీ నా మీదే ఆధారపడతారు, ఎంత పెట్టినా దానితో తృప్తిపడతారు. ఈ చీకట్లో ఎక్కడికి వెళ్ళను? ఎక్కడ వెదకను? భగవంతుడా, నాకెందుకీశిక్ష విధించావు?" ఆమె తలగడలో తల

పెట్టుకుని ఏడ్చింది. తులసికోటదగ్గరకు వెళ్ళి సాష్టాంగపడి "తల్లీ, ఆయన్ని కాపాడు, మళ్ళీ సురక్షితంగా యిల్లు చేర్చు తల్లీ" అని ప్రార్థించినది.

విశ్వనాథం ఆ రాత్రి వీథిలో కొంతదూరం నడిచాక ఎక్కడికి వెళ్ళాలో తెలియక తిన్నగా రైలుస్టేషనుకు వెళ్ళి, వెయిటింగ్ హాలులో కండువా తలక్రింద పెట్టుకుని పడుకున్నాడు. ఒకవేపు ఆకలీ, యింకొకవేపు చలీ శరీరాన్ని బాధపెట్టేయి ఎలాగో ఆ రాత్రి గడిపి, ఉదయాన్నే అక్కడే కాలకృత్యాలు తీర్చుకుని ఒక మిత్రుని ఇంటివేపు బయలుదేరాడు.

ఆ మిత్రుడు వీధి వసారాలో నులక మంచంమీద కూర్చుని కాఫీ తాగుతున్నాడు అంత ఉదయమే విశ్వనాథం రావడంచూసి, ఏదో అవసరముండేవచ్చివుంటాడని గ్రహించి కొంచెం ముభావంగా "ఏమండీ, ఇలా వచ్చారు" అని పలకరించాడు. బి. ఏ పాసయిన తన కొడుక్కి విశ్వనాథం పెద్దలతోను, మిత్రులతోను మాట్లాడి ఉద్యోగమిప్పిస్తాడనే ఆశ ఈ మిత్రుడికి యిప్పుడు పూర్తిగా పోయింది; ప్రస్తుతం ఎందుకోసం వచ్చాడా అనే సందేహానికి నివృత్తి కలిగింది

"సమయానికే వచ్చానన్నమాట. ఏమదృష్టం, ఏమదృష్టం. తెప్పించండి రామూర్తిగారూ మనకూ ఒక గ్లాసు" అన్నాడు విశ్వనాథం. ఇక వీడు వదిలేటట్లు లేడని గ్రహించినవాడై ఆ మిత్రుడు ఒక గ్లాసు కాఫీ ఇచ్చి, ఒక బీడీ కూడా దానంచేసి, ఏవేవో అబద్ధాలు చెప్పి విశ్వనాథాన్ని సాగనంపేడు.

విశ్వనాథం తక్కిన మిత్రుల్ని కూడా కలిశాడుగాని వాళ్ళుకూడా అతి ముభావంగా వున్నారు. ఆయనకి ఎక్కడా ఒక కానీ అయినా అప్పు పుట్టలేదు. చేయగలిగినదేమీ లేక సాయంత్రంవరకూ ఊళ్ళో వీధులన్నీ తిరిగి చీకటిపడేసరికి మళ్ళీ రైలుస్టేషను చేరుకున్నాడు.

నిన్న రాత్రినుండి కడుపులో బ్రహ్మపదార్థం పడక పోవడంవల్లను, ఎండలో పగలల్లా నగరంలో వృషభంలా తిరగడంవల్లనూ కాళ్ళూ చేతులూ లాక్కొస్తున్నాయి. చలి ఎముకలు కొరుకుతూంది. ఈ రాత్రి యిక్కడ గడపడం కష్టంగా తోచిందాయనకు. అసలు ఎన్నాళ్ళిలా రైలుస్టేషను నివాసం? ఎన్నాళ్ళీ కటిక ఉపవాసం? చేతిలో కానీ లేదు. వచ్చే ఆధారం లేదు, అవకాశం లేదు, ఈ మాసిన గడ్డంతో, మాసిన బట్టలతో, పీక్కుపోయిన మొహంతో వున్న తనకు ఎవరు ఉద్యోగమిస్తారు? పిచ్చివాడిలావున్న తన్ను చూడగానే గెంటివేస్తారు. తను ఎంత నికృష్ట జీవితం గడుపుతున్నాడో అతనికి తెలిసింది. ఏదైనా పనిచేసి, బతుకు తెరువు చూసుకోవాలి. పిల్లలకు చదువు చెప్పించాలి. కుటుంబాన్ని పోషించాలి. ఇన్నాళ్ళూ తన కుటుంబాన్ని ఎవరు పోషిస్తున్నారు? ఇంటిలో ఎలా గడుస్తూంది? తనకు ఇంటిలో రెండుపూటలా భోజనం ఎలా వస్తూంది? ఇన్నాళ్ళకి ఇప్పుడే అతనికీ ప్రశ్నలు బయలు దేరేయి! కాని వాటికి జవాబు దొరకలేదు.

ఆయన లేచి మళ్ళీ నడక ప్రారంభించాడు. చెప్పులు లేకపోవడంవల్ల పాదాలలో రాళ్ళుగుచ్చుకుంటూవుంటే మెల్లగా

కుంటుతూ అడుగులు వేస్తున్నాడు. రాత్రి పదిగంటలకే రోడ్ల మీద జనసంచారం తగ్గిపోయింది. తిన్నగా తన యింటి గుమ్మందగ్గర అతని శరీరం నిలబడిపోయింది.

వీధి వసారాలోకి వెళ్ళి తలుపు తోశాడు. కొంచ ఊపి రితో వున్న లోపలి గోళ్ళెం వూడి క్రిందపడింది. లోపల భార్య కనపడలేదు. పిల్లలుమాత్రం గదిలో నిద్రపోతున్నారు. తిన్నగా పెరట్లోకి వెళ్ళేడు. భార్య దీపం పెట్టుకుని, వొడియాలు పెడు తూంది. చాపలమీద అప్పడాలు ఆరబెట్టివున్నాయి. అంత చలిలోనూ భార్య నుదుట పట్టిన చెమట దీపపు కాంతికి మెరు స్తూంది.

ఆమె తలయెత్తి చూసింది. "అమ్మయ్యా వచ్చారా" అంది. ఆమె కళ్ళలో ఆనందం, దుఃఖం అతనికి కనిపించాయి. ఆమెకు కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"రండి భోజనానికి, వడ్డిస్తాను" అంది మామూలుగా. ఆమె రోజూ తనకు భోజనం ఎలా పెట్టగలుగుతూందో అన్నది అతనికి యీనాడు అర్థమయింది. ★